నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, మంగళవారం 30 జనవరి 2024 | NIRMAL

నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ నాయకులు

సమయపాలన పాటించాలి..

ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం

ఎదులాపురం, జనవరి 29 : పోలీసులు క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన మొబిలైజేషన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నూతన పద్ధతులు, నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవడానికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. దీనిని ప్రతి ఒక్క రిజర్వు సిబ్బంది వినియోగించుకోవాలని కోరారు. కార్డన్‌సెర్చ్, వీఐపీ బందోబస్తు సమయంలో నిర్వహించే తీరు, అధునాతన ఆయుధాల వినియోగం, సంఘ విద్రోహ శక్తులపై పోరాటం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం

ఢిల్లీలో కాంగ్రెస్ ఖతం అయింది..

- రైతు రుణమఫీ హామీని నిలుపుకోలేదు..
- ఇందుకు సోనియాగాంధీ బర్తడే నే నిదర్శనం
- మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జనవరి 29 : ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఖతం అయిందని, తెలంగాణలో కూడా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ఆ పార్టీ అబద్ధాలకు సోనియాగాంధీ బర్తే డే వేడుకలు నిదర్శనమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణ ముఖ్యకార్యకర్తల అనుబంధ సంఘాల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకల్లో రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీని నిలుపుకోలేదన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 10వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు అజయ్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దాసరి రమేశ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం పాషా, యూత్ ప్రెసిడెంట్ శివకుమార్, నాయకులు రాజు, కౌన్సిలర్లు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి..

- ఆదివాసుల సంస్కృతితో కూడిన స్టాల్స్ ఉండాలి..
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

ఇంద్రవెల్లి, జనవరి 29 : ఇంద్రవెల్లి మండలంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కేస్లాపూర్‌లో కలెక్టర్ పర్యటించారు. సీఎం పర్యటనలో భాగంగా నాగోబా దర్శనం, హెలిప్యాడ్ గ్రౌండ్, దర్బార్ హాల్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పొదుపు సంఘాల మహిళలను గుర్తించాలని సూచించారు. నాగోబా దేవాలయ ప్రాంగణంలో చేపడుతున్న వివిధ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావ్, అసిస్టెంట్ గోవర్ధన్, ఆర్డీవో కిషన్, ఆర్డీవో జీవాకర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ పాల్గొన్నారు.

నాగోబా దర్బార్ హాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉద్యోగ సంబురం

ఆదిలాబాద్ జిల్లా నుంచి 282 మంది స్టాఫ్ నర్సుల ఎంపిక

- కేసీఆర్ సర్కారు హయాంలో ప్రక్రియ
- ఐడెంటీ కార్డులు అందజేసిన అధికారులు

విజయ సంకేతం చూపుతున్న కొత్తగా ఎంపికైన స్టాఫ్‌నర్సులు

ఆదిలాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెగ్యూలర్ విధానంలో 282 మంది స్టాఫ్ నర్సులు నియమితులయ్యారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్టాఫ్‌నర్స్‌ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కాగా.. 2022 డిసెంబరు 30న 5,204 పోస్టుల భర్తీకి మెడికల్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. గతేడాది ఆగస్టు 2న ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో 1,890 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది. దీంతో మొత్తం స్టాఫ్ నర్సు పోస్టుల సంఖ్య 7,094కు చేరింది. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో జిల్లా నుంచి 282 మంది స్టాఫ్ నర్సులు ఎంపిక య్యారు. వీరిని రిమ్స్‌తోపాటు పీహెచ్‌సీలలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారిలో చాలా మంది తాత్కాలిక పద్ధతిలో దవాఖానల్లో పని చేస్తున్నారు.

ఇప్పటికే చాలా మందిని నియమించిన కేసీఆర్ సర్కారు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గతేడాది జనవరిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 78 మంది డాక్టర్లను నియమించారు. ఆదిలాబాద్ జిల్లాకు 25 మంది, నిర్మల్‌కు 22, కుమ్రం భీం ఆసిఫాబాద్‌కు 18, మంచిర్యాలకు 13 మందిని కేసీఆర్ ప్రభుత్వం నియమించింది. కొత్తగా ఎంపికైన స్టాఫ్ నర్సులకు బాసర జోనల్ పరిధిలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. వీరికి సోమవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వారి హాల్ టికెట్లను సిబ్బంది పరిశీలించగా.. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఐడెంటీ కార్డులు అందజేశారు. వీరికి ఈ నెల 31న హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేయనున్నారు. కొత్తగా నియమితులైన వారిని హైదరాబాద్ తీసుకెళ్లడానికి అధికారులు బస్సులను ఏర్పాటు చేస్తున్నారు.

సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 29 : నిర్మల్ జిల్లా నుంచి నూతనంగా ఎంపికైన 161 మంది స్టాఫ్ నర్సులకు సోమవారం వైద్యాధికారి కార్యాలయంలో అభ్యర్థుల హాల్‌టికెట్స్, ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. ఎంపికైన వారికి ఐడీ కార్డులు అందజేశారు. ఎంపికైన వారికి 31వ తేదీన హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంతర్‌రెడ్డితో సమావేశానికి ఏర్పాట్లు చేయగా అభ్యర్థులు వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

దివికేగిన రాజకీయ దిగ్గజం

- మాజీ పీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి మృతి
- నివాళులు అర్పించిన జిల్లా కాంగ్రెస్ నేతలు
- సంతాపం తెలిపిన మాజీ మంత్రి అల్లోల
- హైదరాబాద్‌లో అంత్యక్రియలు

హైదరాబాద్‌లో నర్సారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు, శ్రీహరిరావు

పీ నర్సారెడ్డి (ఫైల్)

నిర్మల్, జనవరి 29(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాకు చెందిన రాజకీయ దిగ్గజం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. సారంగాపూర్ మండలంలోని మలక్ చించోలి గ్రామానికి చెందిన నర్సారెడ్డి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీలో చేరి చిన్న నాటి నుంచే రాజకీయ నేతగా ఎదిగారు. అంచెలంచెలుగా ఎదిగి పీసీసీగా, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన హయాంలోనే స్వర్ణ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి సన్నిహితంగా ఉండేవారు. రాజకీయ దురందరుడిగా పేరున్న నర్సారెడ్డి అందరితో సఖ్యతగా ఉంటూ పార్టీలకతీతంగా నేటి తరం రాజకీయ నాయకులకు సూచనలు, సలహాలు అందజేసేవారు. ఆరోగ్యం క్షీణించే వరకు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. కొంత కాలం నుంచి అనారోగ్యం కారణంగా రాజకీయాలకు దూరంగా ఉంటూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. నర్సారెడ్డి మరణంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఆయన పార్థివదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అభిమానులు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. అక్కడికి వెళ్లి పలువురు నివాళులు అర్పించారు.

రాజకీయ ప్రస్థానం

1931 సెప్టెంబర్ 22న నర్సారెడ్డి జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో చదివి బీఏ, ఎల్ఎల్‌బీ పట్టాలు పొందారు. న్యాయవాద వృత్తిలో కొనసాగుతూనే నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ విముక్తి కోసం పోరాడారు. 1940 సంవత్సరం నుంచే క్రియాశీల రాజకీయాల్లో పాల్గొని మూడు సార్లు నిర్మల్ నియోజకవర్గ శాసనసభ్యునిగా, ఒకసారి ఎమ్మెల్సీగా, ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు. 1972-78 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్‌లో రెవెన్యూ, నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేశారు. 1962 -1978 వరకు వరుసగా నిర్మల్ ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్రస్థాయిలో అనేక పదవులను నిర్వహించారు. 1981-85 వరకు ఎమ్మెల్సీగా, 1989-91 వరకు ఆదిలాబాద్ ఎంపీగా ఉన్నారు.

మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సంతాపం

నర్సారెడ్డి మరణంపై మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. విలువలు కలిగిన రాజకీయ నాయకుడిగా, సుపరిపాలనా దక్షుడిగా అందరి మన్ననలను పొందారని గుర్తు చేశారు. ఆయన రాజకీయ జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. ఆయన మృతి తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా నిర్మల్ జిల్లాకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కాంగ్రెస్ నేతల నివాళి

మాజీ మంత్రి నర్సారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జులతో కలిసి ఆమె సోమవారం హైదరాబాద్‌లో నర్సారెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక గొప్ప నేతను కోల్పోయిందన్నారు. ఆయన మృతిపై ప్రగాఢ సానుభూతి తెలుపుతూ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

నర్సారెడ్డితో మాజీ మంత్రి ఐకే రెడ్డి (ఫైల్)

అదనంగా ఎకరం స్థలం కేటాయించాలి..

- అప్పుడే ఇంద్రవెల్లిలో స్మృతివనం ఏర్పాటు చేయాలి..
- అమరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలి
- తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బాపురావ్

సమావేశంలో మాట్లాడుతున్న తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బాపురావ్

ఇంద్రవెల్లి, జనవరి 29 : అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసే స్మృతివనానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో ఎకరం భూమిని కేటాయించాలని తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావ్ డిమాండ్ చేశారు. సోమవారం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. యేటా ఏప్రిల్ 20వ తేదీన అమరవీరులకు నివాళులర్పించేందుకు స్తూపం వద్ద సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సరిపడా స్థలం లేకపోవడంతో ఆదివాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అమరవీరుల స్తూపం వద్ద అదనంగా మరో ఎకరం భూమిని కొనుగోలు చేయాలని కోరారు. ఇంద్రవెల్లి ఘటనలో గాయాలైన వారిని గుర్తించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ఉద్యోగావకాశాలు 100 శాతం ఆదివాసులకే కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గెడం భరత్, మండలాధ్యక్షుడు జుగ్నాక్ భరత్, నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి..

నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, జనవరి 29 : ప్రభుత్వ పథకాల అమలు వేగంగా జరగాలంటే.. శాఖల మధ్య సమన్వయం అవసరమని కలెక్టర్ అశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించారు. వచ్చిన అర్జీలను స్వీకరించిన కలెక్టర్ వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మొత్తం 37 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా స్టాఫ్ నర్సులుగా ఎంపికైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. రెవెన్యూ శాఖలో పనిచేసి ఇతర శాఖలకు సర్దుబాటు చేసిన వీఆర్ఏలకు వచ్చే నెల 1వ తేదీ నుంచి వేతనాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు తమ బయోడేటాను కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారానికి కృషి చేయాలి..

ఆదిలాబాద్ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఎదులాపురం, జనవరి 29 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖలవారీగా దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో జడ్పీ సీఈవో గణపతి, ఆర్డీవో స్రవంతి, సంక్షేమ అధికారులు రమేశ్ రాథోడ్, రాజలింగు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి..

ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా

సమస్యలను తెలుసుకుంటున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా

ఉట్నూర్, జనవరి 29 : గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరించారు. సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో ఏపీవో కనక భీంరావు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్సీవో గంగాధర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

మెరుగైన శాంతిభద్రతలను అందించాలి..

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, జనవరి 29 : నిర్మల్ ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఆమె హాజరై ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడారు. సామాన్య ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని వారితో స్నేహపూర్వకంగా మెదలాలని, శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

మీరిచ్చే గౌరవం ఇదేనా?

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించకపోవడం శోచనీయం
- మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 29 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పి.నర్సారెడ్డి అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం శోచనీయమని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజాసేవలో కొనసాగిన అజాత శత్రువు లాంటి నర్సారెడ్డి అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించకపోవడం దారుణమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ అంత్యక్రియలు జరుపకపోవడం వెనుక అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు.

పూజలు నిర్వహిస్తున్న మెస్రం వంశీయులు

ఉట్నూర్‌కు చేరుకున్న మెస్రం వంశీయులు

ఉట్నూర్ రూరల్, జనవరి 29 : నాగోబా పూజల కోసం పవిత్ర గంగాజలంతో కలమడుగు నుంచి బయలు దేరిన మెస్రం వంశీయులు సోమవారం సాయంత్రం ఉట్నూర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడ వద్ద ఎంపీపీ జైవంత్‌రావు వారికి స్వాగతం పలికారు. అనంతరం టీ, అల్పాహారం అందించారు. అక్కడి నుంచి బయలుదేరిన వారు యేత్మాసూర్ నగర్‌లో బస చేయనున్నారు. మంగళవారం ఉదయం కేస్లాపూర్‌కు పయనం కానున్నారు.

ఆదివాసీ చట్టాలపై రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలి..

ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మానిక్‌రావు

మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా ఉపాధ్యక్షుడు మానిక్‌రావు

నార్నూర్, జనవరి 29 : ఇంద్రవెల్లిలో పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసుల చట్టాలపై స్పష్టత ఇవ్వాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కుమ్రం భీం కాంప్లెక్స్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టబద్ధలేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, 11 కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు జారీ చేయాలన్నారు. ఆర్టికల్ 342 ప్రకారం ఉన్న వారినే షెడ్యుల్డ్ తెగల్లో కొనసాగించాలని కోరారు. ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 3 యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో మండలాధ్యక్షుడు ఆడా శ్రీరామ్, ఉపాధ్యక్షుడు ఆత్రం పరమేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీని ప్రారంభించాలి..

నిర్మల్ టౌన్, జనవరి 29 : నిర్మల్ జిల్లాలో రెండో విడుత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరుతూ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. గొల్ల, కుర్మలు రెండో యూనిట్ కోసం డీడీలు చెల్లించి యేడాది దాటింది. వెంటనే ప్రభుత్వం అర్హులైన వారికి యూనిట్లను పంపిణీ చేయాలని కోరారు. సంఘం నాయకులు శ్రీకాంత్, మల్లేశ్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు